పోలయ్య

వితలాపురాగ్రహారం వైదీకి బ్రాహ్మణ్యం పుట్ట. అనాది అగ్రహారం. ఆ అగ్రహారంలో గల రెండువందల బ్రాహ్మణకుటుంబాలలోకీ వెంకట శాస్త్రి మకుటం వంటివాడు. గొప్ప తర్కశాస్త్ర పండితుడూ, వైయాకరణీ, నైష్ఠికుడూను. త్రికాలములా సంధ్యావందనం చేసుకోనిదే గంగ తాకడు. సనాతన ధర్మం అన్నా, వర్ణాశ్రమ ధర్మం అన్నా చెవి తెగ్గోసుకొంటాడు. చిన్నతనంలో తల్లిదండ్రుల్ని విడిచి కాశీకి వెళ్ళి పదేళ్ళుగా గురు కులవాసం చేసి శాస్త్రం పఠించిన పండిత శ్రేష్ఠుడు.

ఆయనకు పంచములంటే సుతరామూ సరిపడక పోవడం అంతగా ఆశ్చర్యకరమైన విషయం కాదు. పంచముకంటే పనికిరాని బ్రాహ్మణోత్తము లెంతమందో లేకపోలేదు. కాని వెంటకశాస్త్రి మట్టుకు వాండ్ల విషయమై ప్రత్యేక కృషి చేశాడు, గాంధీగారు అస్పృశ్యతా నివారణోద్యమం ఆరంభించినది లగాయతు పంచములను గురించి అనేక గ్రంథాలు తిరగేసి, కూలంకుషంగా గాలించి పంచముల పుట్టుపూర్వోత్తరాలను గూర్చి గొప్ప పరిశ్రమ చేసిన పరిశోధకుడు, ఆయన అసలు పంచములు హిందూమతానికి సంబంధించిన వారు కారని ఓం ప్రథమంలో ఒక నూతన సిద్ధాంతాన్ని లేవదీశాడీ మహనీయుడు!

ఆ బ్రాహ్మడికి వయసు ముదిరినకొద్దీ, తాను చేసిన గాఢమైన పరిశోధన ఫలితంగా, చిన్నతనంలో ఆయనకు పంచముల విషయమై ఉండిన అభిప్రాయాలన్నీ వయస్సుతో కూడా ముదిరి, స్థిరపడి, నఖశిఖపర్యంతమూ గాఢంగా నాటుకొనిపోయినవి. రానురాను ఈ కృషిలో ఆయన కత్యంతమైన విశ్వాసమూ, ఆనందమూ కలుగుతూ వచ్చింది. అందువల్ల ఆయన కాశీ విడిచి, ఇల్లు చేరుకొని వివాహం చేసుకొన్నది లగాయతు, ఈ ముప్ఫై ఏళ్ళుగా స్వగ్రామంలోనే బ్రాహ్మణవిద్యార్థులకు విద్యాదానం చేసుకొంటూ కాలక్షేపంచేస్తూ వస్తున్నాడు.

అస్పృశ్యతను తొలగించవలెననీ, పంచములకు హరిజనులని నూతన నామకరణం చేసి వారికి దేవాలయ ప్రవేశంకూడా ప్రసాదించవలెననీ –ఇట్లాంటి బిల్లులూ, ఉద్యమాలూ,

ఉపన్యాసాలూ బయల్దేరేవరకు, ఆయన కాపాదమస్తకమూ ఒళ్ళు కంపించిపోయి, తనకళ్ళ యెదుట సనాతన ధర్మం చచ్చిపోతూ వుండగా, తనవంటివారు చూస్తూ చేతులు ముడుచుకొని కూర్చోవడం భావ్యంకాదని, సనాతన ధర్మోద్ధరణం కోసం నడుంకట్టి రణరంగంలోకి దూకినాడు. ఆక్షణం లగాయతూ నూతనోద్యమాన్ని రూపుమాపి సనాతన ధర్మం స్థాపించే పనిమీద, ఆయన తిరగనన్ని దేశాలూ తిరిగితిరిగి వేసారిపోతూ ఉన్నాడు.

ఇంటివద్ద సంసారం యావత్తూ చేతి కెక్కివచ్చిన ఇరవైఏళ్ళ కొడుక్కి వప్పగించి, మాలమాదిగలను పైకిరానియ్యకుండా చేసే కృషి మీద ఉత్తరహిందూ దేశంలో పర్యటనం నిమిత్తం ఇప్పటికి రమారమి రెండేళ్ళక్రిందట బయల్దేరి వెళ్ళాడు. కాశీ, గయ, ప్రయాగ, ఢిల్లీ, పంజాబు, బరోడా వగైరా స్థలములలో అనేకమంది పండితులతో పంచములకు సంబంధించిన విషయాలన్నీ చర్చించి, కొత్త విషయాలెన్నో సేకరిస్తూ,తన సిద్ధాంతాలను దృఢపర్చుకొంటున్నాడు. ఆఖరుకు పంచములు హిందూమతం వదలి అన్యమతాల్లో కలుస్తామని తీర్మానించుకొన్నట్టు వదంతి పుట్టేవరకు 'పీడ వదలింద'ని వెంకటశాస్త్రి బ్రహ్మానందపడుతున్నాడు.

ఇల్లు విడిచిన ఇరవైరెండు నెలలకు ఇంటిదగ్గర తనకొడుక్కి కుమారుడు కలిగాడనీ, ఆ సంవత్సరం మాఘ శుద్ధపంచమీ మంగళవారం ఉదయం 9 గంటలకు మనుమడికి బారసాల జరపవలసి ఉందనీ ఆనాటికి పెద్దవాడైన తాతగారు తప్పక రావలసిందనీ, ఉత్తరాల మీద ఉత్తరాలూ టెలిగ్రాముల మీద టెలిగ్రాములూరాగా, ఇక ముహూర్తం నాలుగురోజులుండనగా వెంకటశాస్త్రి కాశీలో బయల్దేరి ఎకాయెకీని సోమవారం రాత్రి 11 గంటలకు తన గ్రామానికి సమీపంలో ఉన్న పుంజూరు స్టేషన్‌లో రైలు దిగాడు.

పుంజూరు నెల్లూరికి దక్షిణంగా పోతే మూడోస్టేషన్. ఆ స్టేషన్ కొంచెం పెద్ద స్టేషనే, అనగా సెకండుక్లాసు స్టేషన్‌గానే లెఖ అయినప్పటికీ,ఆ రాత్రిమట్టుకు వెంకటశాస్త్రితో కూడా ఏ అయిదారుగురో కంటే జాస్తిగా జనం దిగలేదు. వెంకటశాస్త్రి రైలుదిగీ దిగడంతోనే గేటులో టిక్కెట్టు ఇచ్చేసి, కాశీ గంగ చెంబులూ, తనగుడ్డలూ కలిపిన మూట నొకచేత్తోనూ, జరీ రాగి చెంబు మరొకచేత్తోనూ పట్టుకొని గేటుదాటి బయటికి వచ్చాడు.

పుంజూరు స్టేషన్‌కీ విఠలాపురానికీ పద్దెనిమిది మైళ్ళు బరువుగా ఉన్నది. పదహారు మైళ్ళు కంకరరోడ్డు మీదా, రెండు మైళ్ళు మట్టిరోడ్డు మీదా పోవాలె. ఆ రోడ్డుమీద రాత్రి అనకుండా, పగలనకుండా ఎప్పుడూ ఎడతెరపిలేని రహదారీ ఉంటూ ఉండేది. ఆ రోడ్డు పుంజూరు నుండి గంగపట్టణం మీదుగా తూర్పు సోమేశ్వరం వరకూ ముప్ఫైమైళ్ళు పోతుంది.

ఏ పొయ్యిల్లో ప్రయాణంచేసినా భయంలేని రస్తా కాబట్టి,రైలు దిగంగానే బండి కట్టుకుంటే కాకులు కూసేవేళకు అలాగ్గా ఇల్లు చేరుకోవచ్చు గదా అనుకొని సోమవారం రాత్రి బండికే వచ్చాడు వెంకటశాస్త్రి. కాని ఏ రైలుకు చూచినా బిలబిలమంటూ ఒంటెద్దు బళ్ళవాళ్ళు ప్రయాణీకుల కాళ్ళ కడ్డం తగిలి చేతిలో మూటలు పెరుక్కొని పొయ్యేసమ్మర్దం గల ఆ స్టేషన్ దగ్గర ఆ రాత్రి వెంకటశాస్త్రికి ఒక్క ఒంటెద్దు బండి అయినా కంటిలో కలికానికి కూడా కనుపించలేదు.

రాత్రి పదకొండున్నరా, రమారమి పావుతక్కువ పన్నెండూ కావొచ్చింది. వెంకటశాస్త్రి దిగిన రైలు కూతేసి వెళ్ళిపోయి చాలాసేపయ్యింది. తనతో కూడా దిగిన జనం ఎట్లా వెళ్ళారో ఎవరిదారిన వారు వెళ్ళారు. రాత్రి డ్యూటీచేసే రైలు ఉద్యోగి గేటు తలుపు బిగించి, పోర్టరూ తనూ అప్పుడే చెరొక బెంచీమీదా నడుములు వాల్చారు. స్టేషన్ నిశ్శబ్దంగా ఉంది. పైన వ్రేలాడకట్టిన లాంతరు దీపం తగ్గించబడి, మినుకు మినుకుమంటూ ఉంది.

స్టేషన్ మెట్లు దిగి పడమటగా ఉన్న మైదానంవైపు వెంకటశాస్త్రి పరకాయించి చూచాడు. ఆ ప్రదేశం అంతా నిర్జనంగా ఉంది. తాను రెండేళ్ళ క్రిందట చూచిన స్థలంతో పోల్చుకుంటే ఇప్పటి ప్రదేశం పాడుపెట్టిన ఇల్లు వలె కళావిహీనమై కన్పడింది. శుద్ధపంచమి కాబట్టి నెల చాలా లేతలోనే వారిగిపోయింది. వెంటనే చీకటి అలుముకొని విజృంభించింది. మాఘమాసం. మంచు కురుస్తోంది. చలి దవడలు నొక్కేస్తూ వుంది. బిగబట్టిన చేతి పిడికిళ్లు విప్పితే శరీరం యావత్తూ పీక్కొని తినేటట్టుగా ఉంది చలి. వెంకటశాస్త్రిది అంత ముసలి వయస్సు కాకపోయినా, యాభైదాటి అరవైలో పడ్డ ఘట్టం. అందువల్ల అంత తీవ్రమైన చలికిగాని, ఎండకు గాని పూర్వంలాగా ఓర్చుకోలేకపోతున్నాడు. ఏమైనప్పటికీ, తెల్లవారకుండా ఆ పద్దెనిమిది మైళ్ళ ప్రయాణం చేసి తీరాలే, విధిలేదు. వెంటనే బయల్దేరితేనే గాని అనుకొన్న ప్రకారం ఇంటికి చేరుకోలేడు ముహూర్తానికి ముందుగా అందుకోకపోతే చేసిన ప్రయత్నం వృథా అయిపోవడమే కాకుండా తాను రానందుకు ఇంటిదగ్గర ఖంగారుపడతారేమో! బాడుగ బండ్లను నమ్ముకొని ప్రయాణం చేశాడు. తాను ఇల్లు విడచిన ఈ రెండేళ్ళుగా కాలపురుషుడు కలుగజేసిన మార్పులాయన కేం తెలుస్తై? "స్టేషన్‌కు ఇంటిదగ్గర నుంచి బండిని పంపవలసిందని అబ్బాయికి జాబు వ్రాసినా బాగుండిపోయ్యేది. ఎంత పొరపాటుపడ్డాను" అని తనలో తానే పస్తాయించు కొన్నాడు. కొంతసేపటికి, అసలు ఆ స్టేషన్ పుంజూరు స్టేషనేనా అని ఆయన కనుమానం వేసింది. ప్లాటుఫారం మీదికి వెళ్ళి చెక్కమీద అక్షరాలు చదువుకొన్నాడు. "పుంజూరు" అని ఆయనకళ్ళకు కనుపించింది. మనిషికి అనుమానం తీరింది. కొంత ధైర్యం కలిగింది.

కాని ఏంలాభం! ప్రయాణం సాగే ఎత్తు కనపడడం లేదు. ఒక్క బండి అయినా లేకుండా ఇంత శూన్యం కావడానికి కారణ మాయనకు గోచరించడం లేదు. ఎవరినైనా అడిగి తెలుసుకొందా మనుకొన్నాడు. కాని ఎక్కడా మనిషి సంచారం లేదు. సర్వమూ నిశ్శబ్దంగా ఉంది. కీచురాళ్ల కూతలూ ఎక్కడనో దూరంగా మొరిగే కుక్కల అరుపులూ తప్ప మరోధ్వని శాస్త్రి చెవికి సోకడం లేదు. పోనీ, గ్రామంలోకి పోయి బండ్లకొరకు విచారిద్దామా అనుకొన్నాడు. కాని ఒక మైలుపోతేనేగాని ఊరు కనపడదు. ఆ అంధకారంలో, ఆ చలిలో, ఆ మూట భుజాన వేసుకొని అంతదూరం పోలేకపోయాడు. ఆయనకేమీ పాలుపోకుండా ఉంది. ఏమీతోచక -మంచులో తిరిగితే రాత్రి నిద్రలేక జలుబు భారం చేస్తుందేమోనని-బయట మైదానంలో తిరిగే మనిషి స్టేషనుహాల్లోకి పోదామని వెనక్కి తిరిగి, నాలుగడుగులు వేశాడు. ఇంతలో పడమటి తట్టునుండి ఏదో ఒక బండి వస్తున్నట్టు చప్పుడయింది. శాస్త్రి తటాలున వెనక్కి తిరిగి చూశాడు. ఒంటెద్దుబండి ఒకటి వచ్చి ఆ తట్టు ఎడంగా ఉన్న ఒక వేపచెట్టుకిందికి పోయి నిలచింది. వెంకటశాస్త్రికి కొంత ఆశ కలిగింది. పరవాలే దనుకొన్నాడు. వడివడిగా పదిబారల దూరం అడుగు వేసుకొంటూ పోయ్యేవరకు, బండివాడు ఎద్దును విప్పి, కాడి కింద పెట్టి, చాపకింద గడ్డి తీసి అప్పుడే ఎద్దుముందర వేశాడు. గడ్డి తినడానికిగాను, బయట నిలబడిన ఎద్దు నొగలదొడ్డిలో ఒకకాలు ముందుకువేసి, మెడకిందా పొట్టకిందా పుటుకున కుట్టే జోరీగలను మూతితోనూ, చెవులతోనూ, తోకతోనూ తోలుకుంటూ,ఇంకాగడ్డిలో మూతిపెట్టకుండానే నిలబడి ఉన్నది. పండుకొని నిద్రపోదామని బండివాడు ఈతాకుల చాపను బయటికి తీయబోతూ ఉన్న సమయంలో వెంకటశాస్త్రి వెళ్ళి "అబ్బీ! విఠలాపురానికి బండి కడతావా?" అని అడిగాడు.

"విఠలాపురమూ లేదు, గిఠలాపురమూ లేదు. వెళ్ళవయ్యా" అన్నాడు బండివాడు.

"బాబుకాదూ! నా తండ్రికాదూ! నేను చాలా తొందరగా పోవాలె. ఇప్పుడు ఎకాఎకీని పోకుంటే నాకు చాలా తొందరపనులు చెడిపోతవి. నాకోసం కాస్త కష్టపడుదూ నాయనా! పెద్దవాణ్ణి! బహుమంచివాడిని" అని ప్రాథేయపడ్డాడు శాస్త్రి,

"నాకు నిద్రొస్తోంది తాళవయ్యా! పండుకోవాలె" అని బండివాడు చాప నేలమీద పరిచాడు. నిద్రబద్ధకం తోసుకురావడం చేత చాపమీద నడుం వాల్చాడు.

ఇక ఆ బ్రాహ్మణుడు బండి కట్టమని 'బాబుకాదూ, నాయనకాదూ' అని ఒకటే బ్రతిమాలడం మొదలుపెట్టాడు. బండివాడు కట్టలేనని విసుక్కోవడమూ, బ్రాహ్మణుడు బ్రతిమాలడమూను. చివరకిది పనికాదని "ఇదిగో చూడు. నువ్వు కోరినంత బాడుగిస్తాను.

రూపాయిన్నర ఇస్తాను తీసుకో లే! ఎక్కడా బండి చిక్కలేదు నాకు. గిరాకీగా ఉంది: పోగొట్టుకోబోకు" అని ఆశపెట్టాడు శాస్త్రి.

"ధనమూల మిదం జగత్" కదా! మామూలు బాడుగకంటే అర్ధ రూపాయి అదనంగా వచ్చేసాగీ కనపడేవరకు బండివాడికి ఆశ పుట్టింది. వెంటనే వాడు చాప చుట్టి బండిలోవేసి, "ఎంతమంది మనుష్యు"లని అడిగాడు.

"నే నొక్కణ్ణే" అన్నాడు శాస్త్రి.

బండివాడు ఎద్దుముందర వేసిన గడ్డిని బండిలో చాపకింద తురిమి, నొగ ఎత్తి, ఎద్దును అంకెకు తెచ్చుకొని, కాడి అఱ్ఱుమీద పెట్టి, మెడ పలుపు బిగించాడు. వెంకటశాస్త్రి జారీచెంబు చేత్తో తీసుకొని వెళ్ళి, కాలు ముడిచి అనుమానం తీర్చుకొన్న తర్వాత మూట తెచ్చి బండిలో పెట్టాడు. కాలి చెప్పులు చాపకింద భద్రపరచి, "పట్టుకో" అని బండివాణ్ణి హెచ్చరించి, "రామయ్య తండ్రి" అంటూ బండిలో ఎక్కి కూర్చున్నాడు. పదిగజాల దూరం రోడ్డు ఎక్కేవరకూ బండివాడు నొగ పట్టుకొనే నడిపించి, రోడ్డెక్కిన తర్వాత పగ్గం బండి వెదురుదబ్బలకు కట్టి, నొగలో ఎక్కి కూర్చున్నాడు. వాడు కొరడాకోసం ఇంకా తడువుల్లాడు కొంటూ ఉండంగనే ఎద్దు మెల్లగా పరుగందుకొన్నది.

రాత్రి చాలా పొద్దుపోయింది. ఒంటిగంట కావచ్చింది. రెండు రోజులుగా ప్రయాణం బడలిక చేత పాపం బ్రాహ్మణుడు డస్సిపోయాడు. కాస్త కన్ను కూర్కుదా మనుకొని, నడుము వాల్చి తలకిందికి మూట లాక్కొన్నాడు. "వెనకబరువు సామీ" అని బండివాడు హెచ్చరించేవరకు మూటతో సహా తాను ముందుకు జరిగాడు. మూటా, మూటమీద పెట్టుకున్న తన తలా, బండివాని పృష్ఠానికి వెళ్ళి తగుల్కొన్నవి. "రవంత వెనక్కు ఆనండి, ముందు బరువయిం"దన్నాడు బండివాడు. బండివాని సహాయంతో మూట కొంచెం వెనక్కు లాక్కొని, బండివాడు "ఆఁ" అన్న తర్వాత, శాస్త్రి కాశ్మీరశాలువ కప్పుకుని ముసుగుతన్ని, కాళ్ళు ముడుచుకొని, ఒత్తిగిలి మూడో అంకెవేసి పండుకొన్నాడు.

బండి రెండుమైళ్ళు సాగిపోయింది. ఆ బండి వట్టి పాతతుక్కు, ఎప్పటిదో ఇక్ష్వాకుల నాటిది. అందులో అడ్డబండి. బాడుగ బళ్ళవాళ్ళకు కమాను బళ్ళెక్కణ్ణుంచి వస్తాయి? పైన గూడుకు వేసిన ఈతాకుల చాప చాలా భాగం శిథిలమై, బండిలో పండుకొని పైకి చూస్తే ఆకాశంలో నక్షత్రాలు అగుపడుతూ ఉన్నవి. బండి చక్రాలకు వేసిన సామాను కులంగల కొయ్య కానందువల్ల, చలికి బిర్రబిగిసి, ఆకులూ, పూటీలూ వంకలు పోయి, ఎగుడు దిగుడుగా బండికి దొడ్డి ఏర్పడింది. కుండల్లోని ఉలవాయిలూ, ఇరుసుకడలూ అరిగిపోయి, కుండ తూముల్లో సందు ఏర్పడి, వదులువల్ల కుండలు రెండూ ఆ పక్కకీ,

ఈ పక్కకీ జరిగి కడసీలలకు టక్కుటక్కుమని తట్టుకొంటూ ఉన్నవి. ఆ తట్టుకోవడంలో అసలే దొడ్డిచక్రాలయినందువల్ల బండిచట్టం యావత్తూ ఆ పక్కనుంచి ఈ పక్కకీ, ఈపక్క నుంచి ఆ పక్కకీ ఊపు ఇస్తుంది. అందులో గతుకులున్నచోట, చక్రం పల్లానికి దిగి మిర్రు కెక్కడంలో, ఎద్దుమెడ మీద ఉన్న కాడితో సహా బండి అడ్డంగా ఉయ్యాలలూగుతోంది. ఈ ఎగుడు దిగుడు ఉయ్యాలల్లో వెంకటశాస్త్రి కళేబరం కూడా ఊగిసలాడుతూ, ఒక పక్కకి ఒత్తిగిలి పండుకొన్నందువల్ల, బండి వెనక్కు మీటినప్పుడు వెన్నెముకకూ, ముందుకి మీటినప్పుడు మోకాళ్ళచిప్పలకీ బండి వాసికొయ్యలూ, పెండెందబ్బలూ కొట్టుకొని బొమికిమీద దెబ్బ తగిలే వరకు–పాపం–ఆ బ్రాహ్మడికి ప్రాణం జిల్లార్చుకొని పోతోంది. కుడిచెయ్యి తలకింద ఉండడం వల్ల, దెబ్బ తగిలినప్పుడల్లా "ఇస్సు: అబ్బా!" అని ఆయన ఎడంచేత్తో ఆ స్థలంలో రుద్దుకొంటున్నాడు. కంటిమీద కునుకెటువంటిదో ఎరుగడు ఆ మానవుడు. ఇన్నాళ్ళుగా ఇంత దేశం తిరిగాడుకాని, ఇంట్లాటి ఉత్కృష్టపు ప్రయాణ సౌఖ్యం ఆయన కెక్కడా లభ్యపడలేదు. ఇక నిద్ర ఎట్లా పట్టుతుందాయనకు? నిద్రపట్టడం మాట ఎట్లాగున్నా, మోకాళ్ళచిప్పలు బద్దలయ్యే బాధ భరించలేక, కాళ్ళు ముడుచుకొన్న మనిషి వెల్లకిలా పొర్లి "శంకరా, మహాదేవా" అంటూ కాళ్ళురెండూ చక్కగా చాచుకొన్నాడు. అట్లాకూడా ఆయనకు ఉసి చిక్కలేదు. బండిచట్టం పొడుగు మట్టమైనందున, చాచిన రెండు కాళ్ళూ మోకాలికింది పిక్కలలగాయతు పాదాలవరకూ చట్టానికి వెలుపలగా వచ్చినై. దానికితోడు బండి ఇచ్చే ఒక్కొక్క ఊపుతో ఒక్కొక్క అడుగు కిందికి జారిపోతూ వచ్చింది ఘటం. ఆ జారిపోవడంలో, తలకింద మూటకీ మూటమీది తలకాయకీ సంబంధం విడిపోయి, రెండూ వేరయిపోతున్నవి. ఇంతలో కాడిపైకి లేచి ఎద్దుకి మెడపలుపు బిర్రుతగిలే వరకు "వెనుక బరువుసామీ, వెనక బరువని బండివాడు మళ్ళా హెచ్చరించాడు. "నీపోరేమిటిరా చచ్చిపోతుంటే" అని శాస్త్రి మూట విడిచి తలకాయ కిందికి జరగకుండా ఉండేటట్లు ఇరుపార్శ్వములా ఉన్న పెండెంకొయ్యల్ని చెరొక చేత్తోనూ గట్టిగా పట్టుకొని, బండి చట్టానికి చివర భాగంలో బిగించిన అడ్డకొయ్యకు కాలి మడిమెలు తన్నిపట్టి, మనిషి బిర్రబిగిసి పైకి ఎగతన్ని పండుకొన్నాడు. ఈ వాటంలో పండుకొనేవరకు మనిషి కిందకి జారపోవడం నిలిచిపోయింది. కాని నిద్రపోవడానికి సావకాశం చిక్కలేదు. ఆయన చేతులూ, కాళ్ళూ, శరీరం యావత్తూ జారిపోకుండా బండిలో నిలబెట్టుకొనే ప్రయత్నంలోనే ఉండవలసి వచ్చె! ఏ మాత్రం పట్టు వదలినా వాటం చెడి మనిషి కింద పడిపొయ్యేటట్టుగా ఉండె ఇక ఆయన నిద్రపొయ్యే దెప్పుడూ?

ఎద్దుకూడా బండికి తగినట్టుగానే ఉంది. ఆ బండివాడు, దానిమొఖాన్న ఎన్నడూ ఇంత పచ్చిగడ్డికాని, ఇంత నున్నపొట్టుకాని కొట్టిన పాపాన్న పోలేదు. కొరడా కొయ్యతో కొట్టేవరకు. శరీరంలో చర్మంతప్ప కండ లేనందువల్ల, ఎముకలకు తగిలి, కొయ్యమీద కొయ్యతో కొట్టినట్లు చప్పుడవుతున్నది. కడుపులోకి తాగిననీళ్ళు తప్ప మరోబలమైన ఆహారం లేనందువల్ల ఎద్దు లగువు తీసినప్పుడల్లా, కడుపులో పేగులు అదిరి ఎద్దు పారుకొంటూ వచ్చింది. వాసన భరించలేక గుడ్డతీసుకొని ముక్కు కద్దు పెట్టుకొంటూ, పండుకొన్న మనిషి లేచికూర్చుని, ఆగ్రహపూరితుడై, "అబ్బబ్బ! ఏం బండిరా, ఈబండీ! నా ప్రాణాలు తీయడానికి వచ్చిందిది. ఛీ! ఛీ! దీన్ని అగ్గిపుల్ల వెలిగించి మంటపెట్టితే పీడ వదలిపోను" అని పెద్దంగా అరిచాడు శాస్త్రి.

బండివాడికి నవ్వొచ్చింది.

"నా బండి కేంతక్కువ సామీ!" అని అడిగాడు వాడు.

"నాశ్రాద్ధం, నాపిండాకూడూను. శరీరం నఖశిఖ పర్యంతమూ హూనమైపోతోంది."

"బండి బాడుగలన్నీ పోయినవయ్యె. వాడడంలేక బాడుగరాక మర్మత్తు లేకపోయె. ఏం చేయమంటారు సామీ!"

"ఇంతదేశం తిరిగాను కడుపులో నీళ్ళు కదలకుండా. ఏరోడ్డు బట్టినా మోటర్లు మయమైపోతుంటే, ఈ దిక్కుమాలిన రోడ్డు మీద మోటారే పడదు. ఛీ! ఛీ! వెధవ ప్రయాణం. ఎరక్కపోయి ఎక్కా నీ ముతనష్టపు బండి" అని శాస్త్రి విసుక్కున్నాడు.

"లేకేమి సామీ! ఎదు రొకటీ, వా లొకటీ-రెండు మోటార్లుండై ఈ రోడ్డుమీద."

"అయితే నాకాసంగతి మొదట్లోనే చెప్పావు కాదేం?"

"తెల్లవారి పదకొండు గంటలబండి చూచుకొని గాని తూర్పుకెళ్ళే మోటరు బయల్దేరదు. తెల్లవారకుండానే ఇల్లు చేరుకోవాలన్నారుగా తమరు?"

"రాత్రికూడా ఒక మోటరు తగలబెట్టకూడదూ ఆ మోటరు వాళ్ళె?"

"వాళ్ళకేం మారాజులు. బాడుగ బండివాడనే పురుగు లేకుండా- ఉన్నవాళ్ళ నందర్నీ జైలు కేసిన తర్వాత-ఇక పగలూ తిప్పుతాడు, రాత్రిళ్ళూ త్రిప్పుతాడు ఆ మారాజు."

"బాడుగబళ్ళ వాళ్ళేమిటి? జైల్లో వేయించడమేమిటి?"

"ఆ కథ అంతా శానా ఉండదిలెండి. చెప్పుకొంటే తీరేమంటకాదు" అని బండివాడు, టుర్రుమని ఎద్దును అదలించాడు.

ఎద్దు దవుడుతీసింది.

"ఎవరు వేయించారు ఈ రోడ్డుమీద మోటార్లు?"

"ఉన్నాడులెండి ఒక పుణ్యాత్ముడు. మా ప్రాణాలకు శనేశ్వరుడై పట్టి పీక్కొని తింటున్నాడు."

"ఆయన పేరు?"

"చెంచునాయుడంట."

"ఏ చెంచునాయుడు?"

"బోళ్ళ చెంచునాయుడు."

"ఏవూరు?"

"గంగపట్నం ఆయనగారిది."

గంగపట్నానికీ విఠలాపురానికీ ఒకమైలు దూరం. విఠలాపురం గంగపట్నం మజరాగ్రామమే. చెంచునాయుడుకీ, వెంకటశాస్త్రికీ ప్రాణ స్నేహం. చెంచునాయుడు, మోటరు, బళ్ళవాళ్ళు, జైలు–ఈ మాటలు చెవినిపడేవరకు కాని స్నేహితుడు చెంచునాయుడి కేదో ఆపద కలిగి ఉంటుందని శాస్త్రికి కొంత ఆందోళన కలిగింది. తాను కొత్తమనిషి వలె నటించి, అచ్చటి విశేషాలేమో బండివాని వల్ల తెలుసుకొందామని శాస్త్రి కొక ఆలోచన పుట్టి, "అయితే ఎన్నాళ్ళయిందీ రోడ్డుమీద మోటర్లు వచ్చి" అని బండివాణ్ణి అడిగాడు.

"అంతా ఒక సంవత్సరం అయింది. మీదేవూరు సామీ?" అని బండివాడు ప్రశ్నించాడు.

"మాది దక్షిణాది. విఠలాపురంలో బంధువులుంటే చూడడానికి పోతున్నా."

బండివాడు పలక్కుండా బండి తోలుతున్నాడు; కాని వాడు ఊరుకోవడం శాస్త్రికి హితవుగా లేదు. వాణ్ణి కదిలించి ఇంకా విశేషాలు ఒక్కొక్కటే బయటికి తీయాలని ఆయనకు ఆత్రంగా ఉంది.

"బళ్ళవాళ్ళను జైల్లో ఎందుకు పెట్టార్రా అబ్బీ?"

"ఈ రోడ్డుకు మోటార్లు వచ్చినప్పటి నుంచీ బళ్ళవాళ్ళ కూడు పడిపోయింది. ఆ మారాజు, ఒంటెద్దు బళ్ళవాళ్ళతో పోటీచేసి, వీళ్ళు అర్ధ రూపాయికి తీసుకొని పోతామంటే, వాళ్ళు ఆరణాలకే తీసుకొనిపోతామనీ వీళ్ళు ఆరణాలంటే వాళ్ళు పావలా అనీ, వీళ్ళు పావలా అంటే, వాళ్ళు బేడనీ–ఇట్లా పంతానికి పోటీచేసి ఒక్క పురుగైనా బళ్ళవాళ్ళకు చిక్కకుండా చేశారా మోటారు వాళ్ళు."

"అందుకని ఇద్దరూ కలియబడి కొట్టుకొన్నారా ఏమిటి?"

"కొట్టుకోనూ లేదు. తిట్టుకోనూ లేదు బలవంతుల మీదికి కూటికి లేని కుంకలు పోగలరా? సంసారాలకు జీవనోపాధి పడిపోయి, బళ్ళమీద చిన్నడబ్బు రాకుండా

పోయ్యేవరకు, బళ్ళవాళ్ళకీ, బళ్ళను ఆధారం చేసుకొని బతికే అలగాజనానికి కడుపు మండి, అంతా నూరుమంది తోడయి ఒకరోజు కుమ్మక్కుగా నాయుడిలోగిలి మీద పడి ఆయన గారి ధాన్యపు కొట్ల తాళాలు పగల కొట్టి, తలా పందుం, ఏదుం గింజలు పట్టపగలు దోచుకొన్నారు."

"అయ్యో!"

"అయ్యో లేదు, కొయ్యో లేదు. మరి ఎన్నాళ్ళని కడుపుమంట భరించగలరు చెప్పండి సామీ! ఇంట్లో గడవక బళ్ళనీ ఎద్దుల్నీ కూడా అయిన కాడికి తెగనమ్ముకోవలసి వచ్చె. అందులో ఆ గంగపట్నం బళ్ళవాళ్ళందరూ తురకసాహేబులు. సంసారపోషణ యావత్తూ ఒక్క మొగవాడి రెక్క మీదనే జరగాల. కూలిచేసుకొని బతుకుదా మనుకొంటే వాళ్ళ కులంలో ఆడది బయటికి రావడానికి వీల్లేకపోయె. చస్తారా! ఆఖరికి ఆ తురకలే ఇంత ప్రయత్నంచేసి, ఇతర కులాల వాళ్ళని కూడా లోగట్టుకొని ఇంతపనిచేశారు."

"ఇంకా ఇతరకులాల వాళ్ళంటే ఎవరు?"

"అబ్బో, ఈ మోటారు వచ్చిన తర్వాత ఎంతమందికి కూడు పడిపోయింది సామీ? బళ్ళుచేసే వడ్రంగులకీ, ఎద్దుల బేరగాళ్ళకీ, బండికొయ్యలు అమ్ముకొనే వాళ్ళకీ, బండిగూడు కొట్టే మేదరోళ్ళకీ, ఆఖరికి ఎద్దుకి పచ్చి గడ్డి దోక్కని రోజుకో అణా డబ్బులు తెచ్చుకొనే మాలమాదిగ ముండలకీ-ఇంతమందికీ కూడులేకుండా పోయింది సామీ! ఆ తురకసాహేబులే గంగ పట్నంలో ఇంతమందినీ కలుపుకొన్నారంట; అబ్బ! వాళ్ళు తలుచుకొంటే ఎంతపనైనా చేస్తారు సామీ!

"మంచిపని చేశారు. తగినశాస్తి అయిందన్నమాట!"

"ఏ మయిందో. ఏమయి ఏం క్రియ చెప్పండీ! బలవంతుడిదే రాజ్యం ఈ కాలంలో."

"అట్లాగే."

"ఈ వందమంది మీదా కేసుపెట్టి, ఆఖరికి తలా ఒకటీ, రెండూ' మూడేసేళ్ళు శిక్షవేయించి, జైలుకు పంపేవరకూ ఆ నాయుడూ ఆ పోలీసులూ నిద్రపోలేదు గదా! కానియ్యండి భగవంతు డన్నీ కనిపెడ్తాడు" అంటూ బుగ్గన ఉన్న పొగాకు తుబుక్కున ఊసి డ్రుచ్చి అని ఎద్దును అదిలించాడు.

చివరికి చెంచునాయుడిదే పైచెయ్యి అయిందని వినేవరకు శాస్త్రి మనస్సుకు ఊరట కలిగింది. బళ్ళ వాళ్ళకీ, నాయుడికీ, ఏదో పెద్ద వ్యవహారమే జరిగి ఉంటుందని ఊహించాడు. నాయుడు పట్టుదల మనిషని శాస్త్రికి బాగా తెలుసు. ఇంకా విశేషాలు

ఏమిటో విందామని "అబ్బా! ఎంతకథ జరిగిందిరా అబ్బీ! ఎన్నాళ్ళయింది ఇదంతా జరిగి?" అన్నాడు.

"కేసు జరిగి ఆరునెల్లయింది. ఈ ఆరునెలలుగా విచారణలో ఉండి, అంతా వారంరోజుల కిందటనే జడ్జిగారు శిక్ష చెప్పారు."

"ఆ నాయుడు బాగున్నాడా?"

"బాగుండక ఆయన కేంరోగం? బీదవాళ్ళని ఏడిపించడానికి ఇంకా నూరేళ్ళు బతుకుతా డా పుణ్యాత్ముడు."

"ఆయన దేమైనా పెద్ద స్థితేనా ఏమిటి?"

"ఆయన కేం సామీ, జమీందారు: గంగపట్నం సగం వూరంతా కొన్నాడంట. ఇంకా ఎన్నెన్నో ఆయనకు వ్యాపారాలుండై. సాలుకు ఇరవై వేలు వస్తుందని అంటారు."

"అబ్బా! ఇంత డబ్బుగలవాడు మోటార్లు వేసి బీదవాళ్ళని ఏడ్పించకపోతే నేం పాపం?"

"ప్రజల సౌకర్యం కోసం వేయించాడంట ఈ మోటార్లు. ప్రజలెవరో, సౌకర్యాలేమిటో ఆయన కసలు తెలుసా?"

"ఎంతసేపూ స్వలాభం కొరకే ఈ దొర్లాట- భాగ్యవంతులకు కూడా."

"పోనీ, కేసు పెట్టితే పెట్టాడనుకోండి. పచ్చి గడ్డిగంప లమ్ముకొనే మాలముండల్ని కూడా ఇరికించాలా ఆ దొర? అయినా మా కులం అంటే ప్రతీ వాడికీ అలుసు సామీ" అని అన్నాడు బండివాడు.

బండివాడు "మా కులం" అనేవరకు శాస్త్రికి అర్థం కాలేదు. "మాలకులమనా లేక వాడికులమే మాలకులమనా దాని అర్థం" అని సందేహం కలిగింది శాస్త్రికి. ఏదో ఆలోచనపడింది మనస్సులో!"

బండివాడు తనధోరణి తాను విడవలేదు. ఏదో పరధ్యానంగా ఉండి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. తన బండిలోని మనిషి బ్రాహ్మడని వాడికి తెలియదు. తెలిసినప్పటికీ వాడు బ్రాహ్మలికి కూడా ఇదివరలో చాలా సార్లు బండి కట్టాడు. మళ్ళా అందిపుచ్చుకొని "మా మాలకులానికి కయ్యిలా, కాలవలా చెప్పండి సామీ! ఆ ముండలు బళ్ళవాళ్లకి గడ్డి అమ్ముకొని బతుకుతున్నారనీ, దోపిడీ సమయంలో వాళ్ళు కూడా గంపలు చేతపట్టుకొని ఆ జనంలో ఉన్నారనీ పదిమంది ఆడవాళ్ళను కూడా కేసులో ఇరికించాడు ఆ నాయుడు. వాళ్ళు పసిబిడ్డల తల్లులంట. ఇంటికాడ పిల్లలు అలో లక్షణా అని అల్లాడిపోతున్నారంట! తలచుకుంటే, దుఃఖం వస్తుంది సామీ!" అని బండివాడు ఆ వుద్రేకంమీద ఏమేమో

చెప్పబోతుండగా, వాడు మాలవాడని శాస్త్రికి స్పష్టమయ్యింది. దానితో ఆయన ఒళ్ళు జలదరించింది. బండిలో వక్క క్షణం కూడా నిలవ బుద్ధిలేక కిందికి గభాలున దూకాలనిపించింది. చైతన్యం విడచి కొయ్యబొమ్మ అయిపోయినాడు. బండివాణ్ణి నమిలి మింగేయాలన్నంత ఆగ్రహం వచ్చిందాయనకు; కాని కర్తవ్యం గోచరం కాలేదు. జీవితానికి పరమావధిగా పెట్టుకొని తాను ఇన్నేళ్ళుగా చేసిన కృషి అంతా గంగపాలయ్యి పోయింది. కాశీగంగ చెంబులు బండిలో ఉన్నై. సర్వం జగన్నాథం అయింది. బండివాడి తల రెండు చెక్కలయ్యేటట్టు పగలకొట్టాలనుకొన్నాడు; కాని ధైర్యం చాల్లేదు; చీకటి, అంధకారం. తాను ఒంటరిగాడు; రెండో సహాయం లేదు; బండివాడు ఇరవై, ఇరవై అయిదేళ్ళు వయస్సు గలిగి, మంచి జెబ్బపుష్టిగల మనిషిలా ఉన్నాడు; తిరగబడితే తన వంటి పప్పు బ్రాహ్మలను పదిమందిని కలిపికొట్టేవాడులా కనపడ్డాడు. ఆ పరిస్థితులలో తొందరపడకూడ దనుకొన్నాడు. ఊరికి చేరిన తర్వాత వాడి భరతం పట్టాలని తీర్మానించుకొన్నాడు. బండివాడి కానుకొని ఉన్న తన మూటను ఎడంగా లాక్కొన్నాడు. బండి సాగింది. ఇక బండివాడి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలని శాస్త్రి, "అబ్బీ! నీ దేవూరురా?" అని అడిగాడు.

"నాది ఉత్తరాది - తెనాలండి?"

"ఇక్కడి కెందు కొచ్చావు?"

"పుంజూరులో నామేనమామ కూతుర్ని పెళ్ళిచేసుకొని ఇప్పటి కారునెలలుగా ఇక్కడే నిలిచిపోయాను. ఈ బండి మా మామదేనండి."

"నీ పేరు?"

"పోలయ్య."

"గంగపట్నం బళ్ళవాళ్ళను నువ్వెరుగుదువా?"

"కొంతమంది గుర్తేనండి."

"నువ్వు మాలవాడివి కదా? నీ బండికి జనం దొరుకుతున్నార్రా?"

"ఇప్పుడెవరూ ఆ పట్టింపులు పెట్టుకోవడం లేదండి. అవసరం కొద్దీ అయ్యగార్లు కూడా నా బండి చాలాసార్లు కట్టించుకొన్నారు."

"ఇదివర కెప్పుడైనా విఠలాపురం వెళ్ళావా?"

"విఠలాపురం పోలేదుకాని, గంగపట్నం వెళ్ళాను."

"ఆవూళ్ళో నీకు బంధువు లున్నారా?"

"లేరండి."

"సరే! తొందరగా పోనియ్యి! తెల్లవార వస్తోంది." అన్నాడు వెంకటశాస్త్రి.

తెల్లవారుజామున ఇంకా కనిచీకటి ఉంది. ఇంకా అయిదారు మైళ్ళు పోవాలి బండి. వెంకటశాస్త్రికి స్థిమితం చెడింది. తనంతటి పండితుడు చివరికి మాలవాడి చేతిలో చిక్కు కొన్నందుకు ఆయనకు పట్టరాని ఆగ్రహం కలుగుతూ వుంది. అగ్రజన్మ యెత్తిన తన యెడల అంత అపచారం చేసిన ఒక తక్కువకులం మాలవాణ్ణి ఆ సమయంలో ఏమీ చేయలేని తన నిస్సహాయ స్థితికి ఉడుకమోతుతనం ఉబికి ఉబికి పొర్లివస్తోంది ఆయనకు. హృదయం కుమిలి వేడి నిట్టూర్పు లధికమైనవి. బండివాడిమీద కలిగిన ఆగ్రహాగ్నికి శరీరం యావత్తూ వేడెక్కి, మాఘమాసం చలి మందగించి, కప్పుకొన్న శాలువ వంటిమీద ఉంచుకోవడానికి ఆయనకు చీకాకనిపించింది. శాలువ విసరి బండిలో ఓ పక్కన వేశాడు. ఎప్పుడెప్పుడు ఇంటికి చేరుదామా అని ఆత్రపడుతున్నాడు ఆ బ్రాహ్మడు.

ఉదయం అయిదు అయిదున్నరయ్యేసరికి బండి కంకరరోడ్డు దిగి మట్టిరోడ్డుకు మళ్ళింది. బాగా తూర్పురేఖ లారినవి. బండివాడి మొఖం శాస్త్రికి బాగా గోచరించింది. ఉదయాన్నే ఛండాలుడి మొఖం చూడడాని కసహ్యం అనిపించింది. ఆ సంధ్య వెలుతురులో శాస్త్రి మొఖం కూడా పోలయ్యకు పొడకట్టింది. ఆయన బ్రాహ్మడు కాబోలనుకొన్నాడతడు; కాని ఆయన మొఖంలో వికాసం కనిపించలేదు. మనిషేదో దీర్ఘాలోచనలో ఉన్నట్టుగా అగుపడ్డాడు. మొఖం ఎర్రంగా జేవురించి, నరాలతో కూడా ఉబికి ఉంది. కళ్ళు రెండూ చింత నిప్పులవలె కణకణలాడుతూ ఉన్నై. రాత్రి నిద్రలేక ఆయన మొఖం అట్లా ఉందనుకొన్నాడు బండివాడు.

ఆరుగంటలయ్యేవరకు బండి వితలాపురం చేరి వెంకటశాస్త్రి ఇంటి ముందట నిలిచింది. ఆ రోజు మనుమడి భారసాల. వీధిగుమ్మానికి మామిడాకుల తోరణంకట్టారు. శాస్త్రి ఎప్పుడువస్తాడా అని ఇంటిల్లిపాదీ కోడికూతతో లేచి ఎదురుతెన్నులు చూస్తున్నారు. వెంకటశాస్త్రి బండి దిగి మూట వీధి అరుగుమీద పెట్టి బయటనే నిలబడ్డాడు. కాళ్ళు కడుగుకోను భార్య నీళ్ళు తెచ్చి యిచ్చింది. మొఖం కడుక్కోను పుల్ల తెమ్మని మొఖం కడుక్కొన్నాడు. శాస్త్రి ఇంకా ఇంట్లో అడుగుపెట్టలేదు. "లోపలికి రం"డని భార్యా, కొడుకూ పిలిచారు. "ప్రయాణపుగుడ్డలు లోపల పెట్టడానికి వీల్లేదు. స్నానం చేసిగాని లోపలికి రా" నన్నాడు శాస్త్రి.

బండివాడు "బాడుగ సామీ" అని అడిగాడు. "ఇస్తాను ఉండరా" అని వాడికి జవాబు చెపుతూ, కొడుకును రహస్యంగా పిలిచి, అర్జంటుగా చెంచు నాయుణ్ణి పిలుచుకొని రమ్మని పంపాడు.

చెంచునాయుడికి వెంకటశాస్త్రి గురుపదం. పండితుడన్న గౌరవంచేత, ఆయనకు నాయుడు ఇల్లు కట్టించి ఇచ్చాడు. నాలుగెకరాల మాగాణి వ్రాసి ఇచ్చాడు. ఆయన కొడుకు వివాహానికి ద్రవ్యసహాయం చేశాడు. శాస్త్రిగారి కుటుంబం మీద నాయుడి కెంతో ప్రీతి, అభిమానమూను. ఈ సంబంధం అనాదిగా పెద్దల లగాయతూ వస్తూ ఉన్నది. అందువల్ల తనకు పని ఉన్నా, శాస్త్రికి పని ఉన్నా, ఏ వేళనైనా సరే నాయుడే శాస్త్రిగారి దగ్గరకు స్వయంగా వచ్చి మాట్లాడిపొయ్యే మామూలు. అందువల్ల ఆయన దగ్గర నుండి కబురు వచ్చిందనేవరకు, రెండేళ్ళుగా దేశాటనం చేసి వచ్చినందున ఏమి తొందరపనో అని నాయుడు నిద్రమంచం మీదనుండి లేవడంతోనే తలకు ఫ్లానల్ గుడ్డ చుట్టుకొని, కాలికి చెప్పులు తొడుక్కొని, చేత కర్రపట్టుకొని, ఎకాయెకీని విఠలాపురం బయల్దేరాడు.

అప్పటికప్పుడే సూర్యోదయమయి బారెడు పొద్దెక్కింది. అగ్ర హారీకులు "చాలాకాలానికి దయచేశారు శాస్త్రిగారు" అని కొందరూ, "అగ్రహారం మీద శాస్త్రిగారు మరీ శీతకన్నేశారు" అని మరి కొందరూ, "మమ్మల్ని మరిచేపోయారు-శాస్త్రిగారు" అని ఇంకో కొందరూ, "బహు కాలదర్శనం-క్షేమమా?" అని మరికొంత మందీ-ఇట్లా అనేక రకాలుగా పలకరిస్తూ శాస్త్రిగారి ఇంటిముందర జనం మూగారు. ఇంతలో నాయుడు వచ్చి-"సాష్టాంగ దండాలు" అని శాస్త్రికి దణ్ణం పెట్టాడు.

"దీర్ఘాయుష్యమస్తు. వంశాభివృద్ధిరస్తు, ఐశ్వర్యాభివృద్ధిరస్తు" అని శాస్త్రి దీవించి, చాప తెప్పించి వీధి అరుగుమీద వేయించి నాయుణ్ణి కూచోమన్నాడు.

"చాలా కాలానికి మామీద దయ వచ్చిందే శాస్త్రిగారికి-" అని నాయుడు కుశల ప్రశ్నచేసి ఏదో అనబోతూ ఉండగా, లోపల కుతకుతలాడే శాస్త్రి ఇక భరించుకోలేక, వెంటనే "విన్నాను. కథయావత్తూ విన్నాను. ఈ తాగుబోతుగాళ్ళు నీకు చేసిన అపకారం అంతా చెవికొచ్చింది. అబ్బా! ఎంత గండం తప్పింది నాయుడూ! నిష్కారణంగా వీళ్ళచేతుల్లో నీ ప్రాణాలు పోయిఉండేవి. ఎంతపని జరిగిందీ ఇట్లా జరిగిందని ఒక కార్డుముక్కైనా రాశావుకావు. మావాడూ రాశాడు కాదు-" అని నాయుడికి కలిగిన ఆపదకు తన సానుభూతి చూపిస్తూ ఆదరణ మొదలు పెట్టాడు.

"మీకు వ్రాద్దామనుకొంటూనే సుస్తీచేశాను. ఇంతకూ భగవంతుడు చల్లంగా చూడాలెకాని-వీళ్ళ వల్ల ఏమవుతుందీ వెధవలు;"

"నిజమే! ఇంకా వీళ్ళని ముక్కలు ముక్కలుగా తరిగి ఉప్పుపాతర వేయకుండా ఊరుకొన్నావా నాయుడూ?"

"అయితే అంతపనీ చేయకుండా విడిచిపెట్టేనా ఏమిటి? ఒక్కొక్కడికి మూడేసేళ్ళు వేయించి వంద మందినీ నెల్లూరుజైలుకు పంపించాను. తమరు వినలేదూ?

"ఎంతచేసి ఏం ఉపయోగం? మళ్ళా కథ అంతా మొదటికొచ్చింది. విన్నావో లేదో! జమీందారు వంటివాడివి నిన్నే లెక్క చేయని ఈ మాలమాదిగలు మాబోటివాళ్ళని లక్ష్యపెట్టుతారా? సేతుహిమాచల పర్యంతమూ తిరిగివచ్చాను కాని ఇంత పరాభవం ఎక్కడా పొందలేదు."

"ఏం జరిగిందేమిటి?"

"అదుగోచూడు! ఆ బండిదగ్గర నిలబడ్డాడు వాడు శుద్ధమాలాడు నిన్నగాక మొన్న నూరుమందికి శిక్ష వేయించావు కదా నువ్వు, వీడు భయభక్తులు లేకుండా నన్ను పుంజూరు నుంచి విఠలాపురానికి బండిలో ఎక్కించుకొస్తాడు? వీణ్ణి ఏం చేస్తే పాపం ఉందీ?"

"మాలవాడా వీడు?" బండివాడు పలక లేదు.

శాస్త్రి వాడికేసి చూస్తూ "ఛీ! జవాబు చెప్పకుండా నిలబడతావు. ఆ నోటి మీద వాతలు వేయిస్తా చూడు! రాత్రి తెల్లవార్లూ, ఈ నాయుణ్ణి నోటికి వచ్చినట్లు దూషిస్తూ మాట్లాడావే! ఇప్పుడేమైందా నోరు?"

"దవడపళ్ళు రాలేటట్టు కొట్టక పోయినారా అట్లాంటికూతలు కూసినప్పుడూ? ఈ వొంటెద్దుబళ్ళ వాళ్ళని ఏం చేసినా పాపంలేదు" అన్నాడు నాయుడు.

బండివాడు గడగడ వణికిపోతున్నాడు.

"నేనెవరని నీబండిలో ఎక్కించుకు వచ్చావురా నువ్వు? మాదిగ వాణ్ణనుకొన్నావా? మాలవాణ్ణనుకొన్నావా? మనిషిని గమనించి మరీ బండికట్ట పనిలె?"

"నాకేం తెలుసు సామీ! తమరు బ్రాహ్మలని?" అన్నాడు బండివాడు.

"అయితే బ్రాహ్మడెవడో మాలవాడెవడో కూడా తెలియకుండా కళ్ళకు కావరం ఎక్కి ఉన్నావన్న మాట" అన్నాడు నాయుడు.

"అర్ధరాత్రి నేను మనిషిని గుర్తించలేకపోయాను బాబుగారూ?" అన్నాడు బండివాడు.

"అసలు నిన్ను బాడుగబండి పెట్టుకోమని ఎవరు చెప్పారు? నీ తాతనా డెరుగుదువా నీ ముత్తాత నాడెరుగుదువా నువ్వు బండెక్కి? చెప్ప రానివాడు తన కులవృత్తి మాని ఇంకోవృత్తి చేసుకోవచ్చునని ఎక్కడ ఉందో చెప్పరా? తెలియక ఒకవేళ నా బోటివాడు బండి కట్టమంటే మాత్రం, ఆపైన వర్ణాశ్రమ ధర్మాలు నాశనం చేయడానికి సరేనని తయారవుతావా? 'నేను చెప్పరానివాణ్ణి సామీ!" అని చెప్పనక్కర్లే?" అని వెంకటశాస్త్రి పండ్లు పటపట కొరుకుతూ పరవళ్ళు తొక్కుతున్నాడు.

"చెప్పుతో మాదు పగలగొట్టండి వెధవను. మదం అణుగుతుంది" అన్నాడు నాయుడు. "తెలియక చేశాను సామీ!" అన్నాడు బండివాడు.

"ఛీ! మళ్ళా ఆ కూతే కూస్తావు. తెలియదంటేనే నమ్ముతానా? పదేళ్ళుగా రక్తమాంసాలు వోడ్చి చదువుకొన్న శాస్త్రం అంతా తగలడిపోయిందే, కాశీ సమారాధన చేసుకొందామని కష్టపడి గంగ తెచ్చుకొన్నాను- అంతా నాశనం చేశాడు వీడు."

"వీడి కన్నీ తెలుసు. - ఇట్లాంటి పని చేయవు కదా అని పండబెట్టి పట్టకారతో రెండుగుడ్లూ ఒత్తిస్తే రోగం కుదురును.-అబ్బబ్బ! నా కేసులో ఆ తురకవాళ్ళూ, వీళ్ళూ చేరి నా గడ్డి నాకు పెట్టారు శాస్తుర్లూ! ఈ వందమంది మీదా కేసు రుజువుచేయించి, జైలుకు వేయించే వరకు బోలెడంత యింది నాకు. ఎవరు తిన్నట్టు చెప్పండీ? మీ బోటి బ్రాహ్మడికిచ్చినా దీపం పెట్టుకొని తలచుకొనేవారు. ఆ జడ్జి ధర్మప్రభువు కాబట్టి వీళ్ళెన్ని కూతలు కూసినా మనవాదనే నమ్మి శిక్ష వేశాడు" అన్నాడు నాయుడు.

ఇంతలో అక్కడచేరిన అగ్రహారీకులందరూ తలా ఒక బడితె చేత పట్టుకొని తలొకమాట అందుకున్నారు.

నాయుడికి వేడెక్కింది; కేసు అయింది లగాయతు ఒంటెద్దుబండి వాడంటే అసలే మండిపడుతున్నాడు నాయుడు.

"అయితే వీడికేం శిక్ష చెప్పారు వెంటకశాస్త్రి గారూ" అని ఆ వేడిమీద అడిగాడు నాయుడు.

"ఛండాలుణ్ణి తాకితే, బ్రాహ్మడు ఒళ్ళు తెగ్గాల్చుకొంటేగాని ఆ పాపం పద్నాలుగు జన్మాలదాకా పోదని శాస్త్రం. నాకు కావలసిన ప్రాయశ్చిత్తం వీడికి శిక్ష-" అన్నాడు శాస్త్రి.

నాయుడు వెంటనే ఇద్దరు మనుషుల్ని పిలిచి, బండివాణ్ణి పశువుల దొడ్లో పగ్గాలతో గుంజకు కట్టించాడు. గంపెడు పిడకలు దాలి చేయించి, బొటనవేలులావు ఇనపకర్రు అగ్నిహోత్రంలో పెట్టించి చేటలతో విసిరిస్తున్నాడు.

బండివాడు ఒక విపరీతమైన స్థితిలో పడ్డాడు. చినికి చినికి గాలివాన అయింది వ్యవహారం. ఇట్లా జరుగునని తాను కలలోకూడా అనుకోలేదు. వెయ్యి పెద్దపులుల్లో ఒక్క లేడిపిల్ల! ఇంతమంది అగ్రహారీకుల్ని తానొక్కడూ ఎట్లా ఎదుర్కోగలడు? ఎవరితో మొర పెట్టుకొంటాడు? తాను చేసిన తప్పేమిటో అర్థం గాకుండా ఉంది బండివాడికి. ఇక తన చావు నిజమని స్థిరపర్చుకొన్నాడు వ్రాడు. నోటివెంబడి మాట రావడం లేదు. గొంతుకు ఎండిపోతున్నది. దాహ మవుతున్నది. ఒంటేలుకు పోవలసిన అవసరంగా ఉన్నది. కాని

కాలూ చెయ్యీ కదపడానికి వీల్లేని స్థితిలో ఉన్నాడు. తనకళ్ళ ఎదుట నల్లని ఇనపకర్రు ఎర్రబడుతోంది. ఉత్తర క్షణం తలుచుకొంటే గుండె నీరయిపోతోంది "ఎంతపాపం చేసుకొన్నానో గదా భగవంతుడా! నాకు నిష్కారణంగా ఇంత శిక్ష ఏల విధిస్తున్నావో నారాయణమూర్తీ తండ్రీ" అని లోపల దుఃఖిస్తూ కళ్ళు మూసుకొన్నాడు.

ఇంతలో వెంకటశాస్త్రి నాయుణ్ణి చాటుకు పిలిచి "నాయుడూ! మనం చేసేపని పైకి పొక్కితే, ఆ పోలీసువాళ్ళ వల్ల తంటా రాదుగదా! కాస్త ఆలోచించు నువ్వుకూడా!" అన్నాడు.

"అంత పిచ్చిపని చేస్తాననుకొన్నావా శాస్త్రుర్లూ. పోలీసులు మనం కూర్చోమంటే కూర్చోవాలె, నుంచోమంటే నుంచోవాలె!" అని ధైర్యం చెప్పాడు నాయుడు.

"అయితే తొందరగా కానీ" అని వెంకటశాస్త్రి ఉత్తర్వు ఇచ్చాడు.

కర్రు ఎర్రబడిందో లేదో చూడమన్నాడు నాయుడు.

పోలయ్య కొంచెం వ్యక్తిత్వం మనిషి; కొంచెం చదువుకొన్నావాడు కూడాను. చిన్నతనం నుండీ పట్నవాసంలో పుట్టిపెరిగిన మనిషి. మంచీ, శబ్బరా, దేశ కాల పరిస్థితులూ కాస్త తెలుసుకొన్నవాడు. కళ్ళుమూసుకొన్న కొంతసేపటి కొక ఆలోచన తట్టింది అతగాడికి. "చచ్చేవాళ్ళం ఎట్లాగా చస్తాం. అబద్ధమైతే అయింది. ఈదారి తొక్క ఒక దొంగెత్తువేదాం. నారాయణమూర్తి సాయపడకపోతాడా?" అని నిశ్చయపర్చుకొని. మొండిధైర్యం తెచ్చుకొని, నాయుణ్ణీ, శాస్త్రినీ ఉద్దేశించి,

"నన్ను మీరీ ప్రకారం హింసిస్తున్నారు. నేను చచ్చినా, బ్రతికినా ఈ విషయం పైకి పొక్కక మానదు. మా పాదిరీ దొరగారికి ఈ సంగతి తెలిస్తే, మీరు ఇంతకింతా అనుభవిస్తారు; మీరే బలవంతులని అనుకోకండి. మేము మీ మతం విడిచి క్రైస్తవ మతం తీసుకొన్నా కూడా మీరీ ప్రకారం మమ్మల్ని ఏడిపించడం మా ఏసుప్రభువు గమనిస్తూనే ఉన్నాడు" అని పెద్దగా వెర్రి అరుపు అరుస్తూ కేకపెట్టాడు.

బండివాడి నోటి నుంచి ఈ మాటలు వినవచ్చేవరకు, శాస్త్రీ, నాయుడూ ఒకరి ముఖం ఒకరు చూచుకొన్నారు. "ఇదేమిటి మతం తీసుకొన్నా నంటున్నాడు" అని ఇద్దరూ కొంత తటపటాయించారు.

"నువ్వు క్రయిస్తవుడవా?" అని శాస్త్రి అడిగాడు.

"అవును. మా తాత తన హయాంలో మతం పుచ్చుకొన్నాడు" అని బింకంగా జవాబు చెప్పాడు.

"నీ పేరు?"

"పౌలయ్య"

"బండిలో చెప్పడంలో నీపేరు పోలయ్య అని చెప్పావే!"

"లేదు; పౌలయ్యనే చెప్పాను."

"నీ తండ్రిపేరు?"

"జకరయ్య"

వెంటనే కట్టినకట్లు విప్పుమని నాయుడు ఉత్తర్వుచేసి, శాస్త్రీ, తనూ గడ్డివామి చాటుకు పోయారు.

వెం-రాత్రి చెప్పడంలో పోలయ్య అని చెప్పాడయ్యా, దొంగవేషం వేస్తున్నాడేమో?

నా-మీరు పొరపాటుగా విని ఉంటారు? పౌలయ్యకు బదులు పోలయ్య అని మీకు వినిపించి ఉంటుంది. తల చూడండి, వాడికి క్రాపింగు కూడా ఉంది. సందేహంలేదు, వీడు క్రయిస్తవుడే!

వెం-క్రాపింగు కేం గాని క్రయిస్తవుడయితే కొంచెం ఆలోచించ దగ్గదే.

నా-అమ్మో! ఇంకా నెమ్మదిగా అంటున్నారా? ఈ పాదరీలకీ, సర్కారువారికీ చాలా దోస్తీ ఉంటుందండీ! వాళ్ళు పట్టుపట్టారంటే సీమదాకా కూడా వెళ్ళి తగవులాడుతారు. అంతవర కొచ్చేవరకు ఎంత డబ్బిచ్చినా ఈ పోలీసులు మన ములాజా ఏమీ ఉంచకుండా తోసిరాజంటారు మనల్ని; కాబట్టి తొందరపడగూడదు.

వెం-సరే! అట్లాగే నీ ఇష్టప్రకారమే కానీ! అతిసర్వత్రవర్జయే త్తన్నాడు శాస్త్రకారుడు. అదీగాక, నిజంగా వీడు క్రయిస్తవుడే అయితే మన కంత పట్టింపు లేనేలేదు. మన ప్రభువుల మతం అదే అయినప్పుడు, ఆ మతాన్ని నిందిస్తే ప్రభువుని నిందించినట్లే! "నావిష్ణుః పృథ్వీపతిః; కాబట్టి రాజు అవలంబించిన మతంలో కూడా విష్ణ్వంశ ఉండితీరుతుంది. - మన మతంలోనేకాని, వాళ్ళ మతంలో చండాలు రంటూ లేనేలేరు. కాని ఎటువచ్చీ నాసందేహం ఏమంటే, వీడు నిజంగా క్రయిస్తవుడేనా అని?

నా-అయినా కాకపోయినా, ఈవిషయంలో మట్టుకు మనం తగ్గడమే శ్రేయం. ఏమో! ఏపుట్టలో ఏ పాముందో! వాడు ఉత్తరాది తెనాలంటున్నాడు. అక్కడ వాడికెంత ప్రాపకముందో, ఎవడు చూడొచ్చాడు;

వెం-అవును. వాడింకా మంచివాడు కాబట్టే ఇంతదూరం ఊరుకొన్నాడు.

అని శాస్త్రి తృప్తిపడి మళ్ళా బండివాడి కంటబడకుండా సందుదారిన దొడ్లో దూరాడు. నాయుడు పౌలయ్యకు కట్టిన కట్లు విప్పించి, ఇంటికి తీసుకొనిపోయి రూ. 3 చేతిలో పెట్టి అన్నం పెట్టించి ఇంటికి పంపివేశాడు.